సాక్షి మహబూబ్‌నగర్

ఆదివారం । 5 । నవంబర్ । 2023



రైతుల నిరసన

తమ పొలాలు పరిశ్రమ పేరిట రిజిస్ట్రేషన్ చేశారని నేరళ్లపల్లి రైతులు నిరసన తెలిపారు.

వివరాలు 10లో ▸



పాలమూరు @ బీసీలు

మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో మొదటి నుంచి బీసీల హవా కొనసాగుతోంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.2 /20.1

వాతావరణం

రోజంతా సాధారణంగానే ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశాన్ని మేఘాలు దట్టంగా కమ్ముకుంటాయి. రాత్రి చలి పెరుగుతుంది.

ప్రజా ఆశీర్వాదం కోసం..



- సీఎం కేసీఆర్ పాలమూరు షెడ్యూల్ ఖరారు
- మూడు రోజుల్లో 10 నియోజకవర్గాల్లో పర్యటన
- 6, 19, 22 తేదీల్లో గులాబీ బాస్ బహిరంగసభలు

సాక్షి, నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు మూడు రోజుల్లో పది నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాదసభలు నిర్వహిస్తున్నారు. సోమవారం గద్వాల, మక్తల్, దేవరకద్ర, నారాయణపేట, 19న అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో నిర్వహించే బహిరంగసభల్లో పాల్గొననున్నారు. అలాగే ఈనెల 22న కొడంగల్, మహబూబ్‌నగర్, 27న షాద్‌నగర్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ సుడి గాలి పర్యటనలు చేయనున్నారు. ఇదివరకే జడ్చర్ల, అచ్చంపేట, వనపర్తిలో విజయవంతంగా సభలు నిర్వహించి గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు.

న్యూస్‌రీల్

6న ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా ఉషు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్–17 విభాగం బాల, బాలికల ఉషు (మార్షల్ ఆర్ట్స్) ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపికలు జరుగుతాయని, విద్యార్థులు పాఠశాల బోనోఫైడ్, ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాల కోసం ఉషు జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి వాజిద్ అలీ సెల్ నం. 82970 93100ను సంప్రదించాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకుల నియామకం

సాక్షి, నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతోపాటు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులను కాంగ్రెస్ పార్టీ శనివారం నియమించింది. ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి నియోజకవర్గ అబ్జర్వర్‌గా నసీర్ అహ్మద్, వనపర్తి నియోజకవర్గానికి చిన్నరాజ్ హత్తిహోలి, కొల్లాపూర్‌కు ఎన్‌హెచ్ కోనారెడ్డి, అచ్చంపేటకు హెచ్‌వీ వెంకటేశ్, అలంపూర్‌కు టి.రంగమూర్తి, జడ్చర్లకు వినయ్ కులకర్ణి, నారాయణపేటకు తిప్పన్న కమకనూర్, షాద్‌నగర్‌కు నాగరాజ్‌యాదవ్‌కు బాధ్యతలు అప్పగించింది. వీరు ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు.

సోనామసూరి ధర రూ.2,326


దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,326, కనిష్టంగా రూ.1,709గా ధరలు నమోదయ్యాయి. అలాగే హంస ధాన్యం గరిష్టంగా రూ.1,880, కనిష్టంగా రూ.1,779 ధరలు లభించాయి. వరి కోతలు ప్రారంభం కావడంతో మార్కెట్‌కు హంస, సోనా ధాన్యం కలిపి దాదాపు 5 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

ఫోన్‌పే ఆధారంగా కేసు.. ఎస్‌ఐకి రిమాండ్

నవాబుపేట: సుదీర్ఘంగా శుక్రవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు సోదాలు చేసి ఎస్‌ఐని విచారణ చేశారు. ఎలాంటి నగదు లభించకపోవడంతో ఎస్‌ఐకి ఏమి కాదని అందరు అనుకున్న తరుణంలో ఎస్‌ఐ ఖాతానంబర్‌కు ఫోన్‌పేలో వేసిన నగదు లావాదేవీలు లభించాయి. దీంతో ఎస్‌ఐ ఈ కేసులో ఏసీబీకి చిక్కాడు. నగదు లేకుండా ఫోన్ పేనే చేసిన అదే ఎస్‌ఐ కొంప ముంచినట్టైంది. మండలంలో సంచలనం సృష్టించిన ఏసీబీ దాడుల కేసులో ఎట్టకేలకు శనివారం ఎస్‌ఐ పురుషోత్తంను ఏసీబీ అధికారులు రిమాండ్ చేశారు. ఏసీబీ అధికారులు హైదరాబాద్‌కు ఎస్‌ఐని తరలించారు. అనంతరం విచారణలో బాధితుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోన్ పేలో ఎస్‌ఐకి నగదు చేరిందన్న విషయాన్ని ధృవీకరించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఎస్‌ఐపై వివిధ రకాల ఆరోపణలొచ్చిన విషయం తమకు తెలియదని, కేవలం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాము విచారణ చేసి చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ విషయంలో డిపార్టుమెంట్ విచారణ సైతం జరుగుతుందని ఏసీబీ అధికారులు తెలిపారు.

ఓటు.. సమ్మేళనాలు

- వృత్తి వ్యాపారాల్లో స్థిరపడ్డ వారితో సమావేశాలు
- ప్రతి ఆదివారం ఒక్కోచోట భేటీకి ఏర్పాట్లు
- మద్దతు ఇవ్వాలంటూ నాయకులు విజ్ఞప్తి



నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో రాజకీయం వేడెక్కడంతో రాజకీయ పార్టీల నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఎవరి అంచనాలు వారికి ఉండడంతో ప్రతీ ఓటును కీలకంగా తీసుకుంటున్నారు. కుటుంబ సభ్యులతో పాటుగా నియోజకవర్గాల్లో తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. అయితే కేవలం నియోజకవర్గంలో ఉన్న ఓటర్లను మాత్రమే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓటర్లను కూడా నాయకులు ప్రసన్న చేసుకుంటూ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఆదివారం వచ్చిందంటే ఆయా ప్రాంతాల్లో అభ్యర్థులు సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు.

■ బీఆర్‌ఎస్ పార్టీ అందరికంటే ముందుగానే టికెట్లు కేటాయించడంతో అప్పటి నుంచే ఆ పార్టీ నేతలు వలస ఓటర్లతో ఆత్మీయ సమ్మేళనాలకు శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పుడిప్పుడు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు హైదరాబాద్‌లో ఇది వరకే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మహారాష్ట్రలోని ముంబయి, పుణేలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ ఆదివారం హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో నియోజకవర్గ ఓటర్లతో సమావేశం నిర్వహించనున్నారు. అలాగే మరికొంత మంది నాయకులు సైతం వలస ఓటర్లతో సమావేశాలు ఏర్పాటు చేసే పనిలో ఉన్నారు.

ఒక్క ఓటూ చేజారకుండా ప్రయత్నం

ఈసారి జరరుతున్న అసెంబ్లీ ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ప్రధాన పార్టీలు అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ఎన్నికల్లో గెలుపు కోసం వేస్తున్న ఎత్తులు, వ్యూహాలు రసవత్తరంగా మారాయి. ఉమ్మడి జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో అభ్యర్థుల మధ్య నువ్వానేనా అన్నట్లుగా త్రిముఖ పోటీ ఉండడం ఉత్కంఠగా మారింది. దీంతో అభ్యర్థులు ప్రతి ఓటును చాలా కీలకంగా తీసుకుంటున్నారు. ఉమ్మడి పాలమూరుకు చెందిన ప్రజలు చాలా వరకు ఉపాధి అవకాశాల కోసం హైదరాబాద్, ముంబై, పూణె వంటి ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఇందులో కొందరు అక్కడ తాత్కాలిక నివాసం ఏర్పర్చుకోగా మరి కొందరు శాశ్వత నివాసాన్ని ఏర్పర్చుకున్నారు. ఇందులో చాలామంది ఓటు హక్కు మాత్రం సొంత గ్రామాల్లోనే ఉంది. ఇలా ప్రతి నియోజకవర్గంలో 10 వేల నుంచి 15 వేల మధ్య ఓటర్లు హైదరాబాద్, మహారాష్ట్ర వంటి ప్రాంతాల్లో ఉన్నారు. వీరందరూ ఎన్నికల సమయాల్లో తమతమ ప్రాంతాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆయా నియోజక వర్గాలకు చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వారి వద్దకే వెళ్లి ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేస్తున్నారు.

గ్రామాల వారీగా వివరాల సేకరణ..

ప్రస్తుత రాజకీయాల్లో సోషల్ మీడియా ఎలాంటి పాత్ర పోషిస్తుందో అందరికీ తెలిసిన విషయమే. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వలస ఓటర్లను కలుసుకునేందుకు రాజకీయ నాయకులు టెక్నాలజీని వాడుతున్నారు. అన్ని పార్టీలు తమ నియోజకవర్గాల్లో గ్రామాల వారీగా ఇప్పటికే ఓటర్ జాబితాలను కార్యకర్తలకు అందజేసి, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. ఇలా గ్రామాల వారీగా ఓటర్ల వివరాలతో పాటు వారి ఫోన్‌నంబర్లను సేకరించి వారితో వాట్సప్ గ్రూప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా మొత్తం నియోజకవర్గానికి చెందిన వారు ఎక్కడెక్కడ ఉన్నారనే విషయాలను పరిగణలోకి తీసుకుని అక్కడికక్కడే సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో కీలకంగా వ్యవహరిస్తున్న కొందరు నాయకులు అందరిని సమన్వయ పరిచేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. అందుకోసం స్థానికంగా ఓ సమావేశం ఏర్పాటు చేసి వివిధ అంశాలపై చర్చించడంతో పాటు చేసిన అభివృద్ధి, చేయాలనుకుంటున్న అభివృద్ధిని వివరిస్తూ ఓటర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడి సొంతూర్లలో పేరున్న వ్యాపారులు, ఉన్నత విద్యావంతులు, ఉద్యోగులతో సైతం ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

జంగ్ తెలంగాణ



పుణేలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న 'పేట' ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి (ఫైల్)

స్థానిక పోరును తలపించేలా..

సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్ వంటి స్థానిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటారు. ఇందుకోసం ఒక్క ఓటు కూడా వదలకుండా తమకు పరిచయం ఉన్నవారందరితో సంప్రదింపులు జరిపి తమకు ఓటు వేయాలని అభ్యర్థించేవారు. అయితే ఇప్పుడు శాసనసభ ఎన్నికలు కూడా స్థానిక ఎన్నికలను తలపిస్తున్నాయి. కేవలం సమావేశాల నిర్వహించడమే కాకుండా పోలింగ్ రోజు వారిని సొంత ప్రాంతానికి తరలించేలా అన్ని ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. దీని కోసం ప్రత్యేకంగా అభ్యర్థులు తమ కార్యకర్తలకు ఇన్‌చార్జి బాధ్యతలను కూడా అప్పగిస్తున్నారు.

రెండోరోజు 7 నామినేషన్లు

- జడ్చర్ల నుంచి బరిలో ట్రాన్స్‌జెండర్
- కొల్లాపూర్ నుంచి మూడు, అలంపూర్, నారాయణపేట, జడ్చర్ల, వనపర్తి నుంచి ఒకటి చొప్పున దాఖలు
- ఇంకా ఖాతా తెరవని అచ్చంపేట, దేవరకద్ర, మక్తల్, గద్వాల



జడ్చర్లలో నామినేషన్ దాఖలు చేస్తున్న ట్రాన్స్‌జెండర్ మాతాశ్రీ జానకమ్మ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/జడ్చర్ల/వనపర్తి/నారాయణపేట/కొల్లాపూర్/అలంపూర్: ఉమ్మడి పాలమూరులో రెండో రోజు శనివారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. అలంపూర్, నారాయణపేట, జడ్చర్ల, వనపర్తి నియోజకవర్గాల్లో ఒక్కక్కటి చొప్పున, కొల్లాపూర్‌లో మూడు నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు. అచ్చంపేట, మక్తల్, గద్వాల, దేవరకద్ర నియోజకవర్గాల్లో రెండురోజుల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. కాగా.. కొల్లాపూర్ అసెంబ్లీ స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తరఫున ఆయన పీఏ రాఘవేంద్ర రెండుసెట్ల నామినేషన్లు రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్‌కు అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన గొంతి విక్రమ్ అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ పార్టీ తరఫున, సింగోటం గ్రామానికి చెందిన ఆదిరాల యాదన్నగౌడ్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేశారు. ఇక్కడ ముగ్గురు అభ్యర్థులకు సంబంధించి నాలుగు సెట్ల నామినేషన్లు వచ్చాయని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

■ జోగుళాంబ గద్వాల జిల్లా బీఆర్‌ఎస్ కో–ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య సతీమణి ప్రేమలత బీఆర్‌ఎస్ తరఫున రెండో సెట్‌ను నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు గడువులోగా పార్టీ బీఫాం అందజేయాలని ఆర్‌ఓ చంద్రకళ సూచించారు. తొలి రోజు ఆమె స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

■ వనపర్తి నియోజకవర్గంలో ఒక నామినేషన్ దాఖలైనట్లు ఆర్‌ఓ తిరుపతిరావు తెలిపారు. ఏదులకు చెందిన కుందేళ్ల అర్జున్ అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ తరఫున నామినేషన్ వేశారు.

■ నారాయణపేట నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కొత్తకాపు రతంగ్‌పాండురెడ్డి రెండుసెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రాంచందర్‌కు ఆయన నామినేషన్‌ను అందజేశారు.

■ జడ్చర్ల నియోజకవర్గానికి సంబంధించి బాలానగర్ మండలంలోని పెద్దరేవల్లికి చెందిన ట్రాన్స్‌జెండర్ జానకమ్మ తమ నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ మోహన్‌రావుకు అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల పట్ల వివక్ష కొనసాగుతుందని, ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం లేదన్నారు. తమ హక్కుల పరిరక్షణ, హక్కుల సాధన కోసం ఎన్నికల బరిలో నిలుస్తున్నానని చెప్పారు. తనతో పాటు రాష్ట్రంలోని మరో మూడు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో దాదాపు 3 లక్షల మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని, వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు.

ఐదుగురికి మాత్రమే అనుమతి..

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల సమస్యల పరిష్కారం కోసం రిటర్నింగ్ అధికారులు హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. నామినేషన్ పత్రాలను హెల్ప్ డెస్కులో పరిశీలించుకుంటే ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్దుకోవచ్చు. నామినేషన్ దాఖలుకు అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తున్నారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల నుంచి రెండు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది.

రిటర్నింగ్ అధికారి కార్యాలయం తనిఖీ

జడ్చర్ల టౌన్: నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనందున ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్ సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జడ్చర అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. ఆయన వుంట రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులున్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రవినాయక్

కాంగ్రెస్ వస్తే ప్రాజెక్టులు ఖతం



భగీరథకాలనీలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్) / మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కాళేశ్వరం ప్రాజెక్టుతో సహా జిల్లాలోని కర్వెన, ఉద్దండాపూర్ ప్రాజెక్టులను కూలగొట్టి ఖతం చేస్తారని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, ఇబ్రహింలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాకేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్, శిల్పారామంలను కూడా కూల్చుతారని, కొత్తగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ నిర్మాణం ఆగిపోతుందన్నారు. ప్రజల కోసం పనిచేసే బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలే కాపాడుకోవాలన్నారు. తెలంగాణను ఆగం చేసేందుకు, హైదరాబాద్‌కు వస్తున్న పెట్టుబడులను ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. రాత్రికి రాత్రి పార్టీలు మారి టికెట్లు తీసుకుని వచ్చిన నాయకులు ఎన్నికల తర్వాత కనిపించకుండాపోతారని విమర్శించారు. అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి స్థానిక భగీరథకాలనీ, బీకేరెడ్డికాలనీ, మైత్రినగర్, విఘ్నేశ్వర కాలనీ (మర్లు)లో రోడ్ షో నిర్వహించారు. ఊరును బాగు చేస్తున్న తమకు కులం, మతం ముఖ్యం కాదని అందరూ బాగుండాలనేదే ధ్యేయమన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఎంతో మంది అనారోగ్యం బారిన పడితే వెంటనే సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశామన్నారు. అవసరమైన వారికి హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించి శస్త్రచికిత్స చేయించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్ రష్మిక, నాయకులు ప్రశాంత్, చారి, శ్రీకాంత్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, గణేష్, రామకృష్ణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామాజిక స్పృహ కల్పించడమే ధ్యేయం



కళాశాలలో లీగల్ ఎయిడ్ సెల్ ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం లీగల్ ఎయిడ్ సెల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి ప్రారంభించారు. మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ సెల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవీందర్‌రావు, లీగల్ ఎయిడ్ సెల్ కో ఆర్డినేటర్ సుభాషిణి స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాన న్యాయమూర్తి బొటానికల్ గార్డెన్ సందర్శించి మొక్క నాటి నీళ్లు పోశారు. విద్యార్థులనుద్దేశించి ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ లీగల్ ఎయిడ్ సెల్ ప్రారంభించి వెళ్లిపోయారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి సంధ్యారాణి మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, సామాజిక స్పృహ, అధ్యాపకుల సహాయ, సహకారాల వల్లే కళాశాలలో లీగల్ ఎయిడ్ సెల్ ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో అనేక డిగ్రీ కళాశాలలు ఉన్నప్పటికీ ఇక్కడే లీగల్ ఎయిడ్ సెల్ ఏర్పాటుకు అనేక కారణాలు ఉన్నాయని, అందులో విద్యార్థుల సామాజిక స్పృహ ఒకటన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రవీందర్‌రావు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ముఖ్య భూమిక పోషించే నాలుగు పిల్లర్లలో ముఖ్యమైనది న్యాయశాఖగా అభిప్రాయపడ్డారు. లీగల్ సెల్ కో ఆర్డినేటర్ సుభాషిణి మాట్లాడుతూ జాతీయ న్యాయ దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రవికుమార్‌యాదవ్, రఘుపతి, మల్లారెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ మూడో జాబితా

- మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రకటన

సాక్షి, నాగర్‌కర్నూల్: బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ(బీఎస్పీ) 25 మందితో మూడో విడత అభ్యర్థుల జాబితాను శనివారం ప్రకటించింది. ఈ జాబితాలో ఉమ్మడి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థులకు అవకాశం దక్కింది. నారాయణపేట నియోజకవర్గంలో బొడిగెల శ్రీనివాస్, అలంపూర్‌లో మాకుల చెన్న కేశవరావు, జడ్చర్ల లో శివ వుల్కుందఖర్‌ను అభ్యర్థులుగా ప్రకటించింది. ఇప్పటికే మొదటి విడతలో నాగర్‌కర్నూల్‌లో కొత్తపల్లి కుమార్, వనపర్తిలో నాగమోని చెన్నరాములు ముదిరాజ్‌కు అవకాశం ఇవ్వగా, రెండో విడతలో మహబూబ్‌నగర్‌లో బోయ స్వప్న శ్రీనివాసులు, కొడంగల్‌లో కురువ నర్మద కిష్టప్ప, దేవరకద్రలో బసిరెడ్డి సంతోష్ రెడ్డి, అచ్చంపేటలో మోత్కూరి నాగార్జున, మక్తల్‌లో వర్కటం జగన్నాథ్‌రెడ్డి, కల్వకుర్తిలో కొమ్ము శ్రీనివాస్ యాదవ్, కొల్లాపూర్‌లో గగనం శేఖరయ్య, షాద్‌నగర్‌లో పసుపుల ప్రశాంత్ ముదిరాజ్‌ను అభ్యర్థులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లాలో ఇంకా నారాయణపేట నియోజకవర్గానికి సంబంధించి ఇంకా బీఎస్పీ అభ్యర్థిత్వం ఖరారు కాలేదు.

నిబంధనల ప్రకారమే విధుల నిర్వహణ



కుందన్‌యాదవ్



తేజశ్వి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన నిబంధనల ప్రకారమే వ్యయ నిర్వహణ కమిటీలు, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలు పనిచేయాలని మహబూబ్‌నగర్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు కుందన్‌యాదవ్ అన్నారు. ఎన్నికల నియమావళి అమలులో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వారికి కేటాయించిన ప్రాంతంలో విస్తృతంగా తనిఖీ చేయాలన్నారు. ఏదైనా ప్రత్యేకంగా ఫిర్యాదు వచ్చినప్పుడు ఆ ప్రాంతానికి వెళ్లి నివేదిక ఇవ్వాలన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో నియమావళిని ఉల్లంఘించే వారిని ఉపేక్షించవద్దన్నారు. జడ్చర్ల, దేవరకద్ర పరిశీలకులు జీవీ తేజస్వి మాట్లాడుతూ ఎన్నికల వ్యయ నిర్వహణకు నియమించిన బృందాలతోపాటు ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలు అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, ముఖ్యంగా బ్లూ బుక్ ప్రకారం విధులు నిర్వహించాలని చెప్పారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్ల నియామకం

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్‌గా ఐఆర్‌ఎస్ అధికా రి కుందన్‌యాదవ్‌ను నియమించింది. ఈయన ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మొదలైన శుక్రవారం నుంచి ఈ నెలాఖరు వరకు మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో ఉంటారు. ఈ క్రమంలో నియోజకవర్గ ఎన్నికల వ్యయ నిర్వహణకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే కుందన్‌యాదవ్, ఫోన్ నం. 8522875620కు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చు. అలాగే జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్‌గా ఐఆర్‌ఎస్ అధికారి జీవీ తేజశ్వి నియమించారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన ఫిర్యాదులను జీవీ తేజశ్వి ఫోన్ నం .8522875619కు సమాచారం ఇవ్వాలి.

పరిశ్రమ విస్తరణకు వ్యతిరేకం కాదు..

ఓవర్‌లోడ్ వాహనాలతో ఇబ్బందులు ● రేపు మరోసారి ప్రజాభిప్రాయ సేకరణ

- వివరాలు 10లో

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం



మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. శనివారం ఆయన ఎస్పీ కార్యాలయంలో చలికాలం నేపథ్యంలో పోలీస్ సిబ్బందికి ఉన్ని కోట్లు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ వృత్తి అత్యంత కష్టతరమైందని, చలి, ఎండ, వర్షాల ను లెక్క చేయకుండా అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తుంటారన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది విధులతో ఆరోగ్యంపై కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలని కోరారు.

పాలమూరు @ బీసీలు

- మహబూబ్‌నగర్ సెగ్మెంట్‌లో 10సార్లు బీసీ నేతలకు పట్టం
- నాలుగుసార్లు రెడ్డి వర్గం నేతల గెలుపు
- రెండు దఫాలు మైనార్టీల విజయం
- నలుగురికి వరించిన మంత్రి పదవులు


జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ చౌరస్తా

పాలమూరు: మహబూబ్‌నగర్ నియోజకవర్గం 1952లో ఏర్పాటు అయింది. మొదటి నుంచి ఇక్కడ బీసీల హవా కొనసాగుతోంది. మొత్తం 17 సార్లు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించగా.. 10 సార్లు బీసీ నేతలే ఎన్నికయ్యారు. నాలుగుసార్లు రెడ్డి వర్గం నేతలు గెలుపొందగా.. రెండు దఫాలు మైనార్టీ నేతలు విజయం సాధించారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులే అధికంగా పోటీ చేశారు. 2016లో జిల్లా విభజన తర్వాత మహబూబ్‌నగర్‌ను అర్బన్, రూరల్‌గా ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి హన్వాడ మండలం కీలకంగా ఉంది. ప్రతి సార్వత్రిక ఎన్నికలోనూ అందరి చూపు మహబూబ్‌నగర్‌పై ప్రత్యేకంగా ఉంటోంది. ప్రస్తుతం పట్టణంలో మైనార్టీల ఓట్ల సంఖ్య పెరిగింది.

❒ 6వ నిజాం మహబూబ్ అలీఖాన్ పేరిట మహబూబ్‌నగర్ పేరు వచ్చింది. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంగా ఉన్న సమయంలో ఈ పట్టణానికి రైలు మార్గం ఏర్పడటంతో జిల్లా కేంద్రాన్ని ఇక్కడికి మార్చడం జరిగింది. పాలమూరు సమీపంలో 700ఏళ్ల వయసు గల పెద్ద మర్రివృక్షం (పిల్లలమర్రి) ఉంది. దీన్ని పర్యాటక కేంద్రంగా మార్చారు. 2008లో పాలమూరు విశ్వవిద్యాలయం ఏర్పాటు అయింది. పల్లెర్ల హన్మంతరావు, ఎదిరె చెన్నకేశవులు, సరోజిని పుల్లారెడ్డి, ప్రమోద్ హాజిన్, ఎస్‌బీ శ్రీహరి ఇక్కడ జన్మించిన ప్రముఖులు. 167వ జాతీయ రహదారి పట్టణ మీదుగా ఉంది. తూర్పుకమాన్ పట్టణంలో ఉన్న చారిత్రక కట్టడం. పిల్లలమర్రిలో 1976లో ఆర్కియాలజీ మ్యూజియంతో పాటు మినీ జూపార్క్ ఏర్పాటు చేశారు. దీనికి తిక్కనశాలగా పేరు పెట్టారు. ఇటీవలే పట్టణ సమీపంలో కేసీఆర్ అర్బన్ ఎకో పార్కు (మయూరీ నర్సరీ) అభివృద్ధి చేయగా.. పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. పేదల తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ క్షేత్రం మహబూబ్‌నగర్ మండలంలోనే ఉంది. పట్టణంలోని క్లాక్‌టవర్ చౌరస్తాకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

❒ ఇబ్రహీం అలీ అన్సారీ వైద్యారోగ్యశాఖ మంత్రిగా ఉన్నప్పుడు జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన హయాంలోనే భవన నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభించారు.

❒ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారిలో రాంరెడ్డి, ఆంజనేయులు స్వస్థలం అడ్డాకుల మండలం కందూర్ గ్రామం. పులివీరన్నది దేవరకద్ర కాగా, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిది వెల్దండ. శ్రీనివాస్‌గౌడ్ స్వస్థలం రాచాల గ్రామం.

❒ మహబూబ్‌నగర్ నుంచి నలుగురికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు లభించింది. కాసు బ్రహ్మానందరెడ్డి, పీవీ నరసింహారావు, జలగం వెంగళరావు క్యాబినెట్‌లలో ఇబ్రహీంఅలీ అన్సారీ మంత్రిగా పని చేశారు. 1993లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి క్యాబినెట్‌లో పులివీరన్న మంత్రిగా కొనసాగితే.. ఎన్‌టీఆర్, చంద్రబాబు క్యాబినెట్‌లలో చంద్రశేఖర్ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం కేసీఆర్ క్యాబినెట్‌లో శ్రీనివాస్‌గౌడ్ ఎక్సైజ్‌శాఖ మంత్రిగా పని చేస్తున్నారు.


శ్రీనివాస్‌గౌడ్

ఓటర్ల వివరాలు..

పురుషులు	మహిళలు
1,21,397	1,21,960
ఇతరులు: 10	మొత్తం: 2,43,367

2014 ఎన్నికల్లో పోలింగ్ ఇలా..

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
వి.శ్రీనివాస్‌గౌడ్	టీఆర్‌ఎస్	45,447
యెన్నం శ్రీనివాస్‌రెడ్డి	బీజేపీ	42,308
సయ్యద్ ఇబ్రహీం	స్వతంత్ర	27,395
ఒబేదుల్లా కొత్వాల్	కాంగ్రెస్	22,744

2018 ఎన్నికల్లో..

శ్రీనివాస్‌గౌడ్	టీఆర్‌ఎస్	86,474
ఎం.చంద్రశేఖర్	కాంగ్రెస్/టీడీపీ	28,699
సయ్యద్ ఇబ్రహీం	బీఎస్పీ	21,664


పి.చంద్రశేఖర్


యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

1962 నుంచి 2018 వరకు జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల వివరాలు..

ఏడాది	గెలిచిన అభ్యర్థి	పార్టీ	పొందిన ఓట్లు	సమీప ప్రత్యర్థి	పార్టీ	పొందిన ఓట్లు
2018	వి.శ్రీనివాస్‌గౌడ్	టీఆర్‌ఎస్	86,474	ఎం.చంద్రశేఖర్	కూటమి	28,699
2014	వి.శ్రీనివాస్‌గౌడ్	టీఆర్‌ఎస్	45,447	శ్రీనివాస్‌రెడ్డి	బీజేపీ	42,308
2012 ఉ.ఎ.	యెన్నం శ్రీనివాస్‌రెడ్డి	బీజేపీ	39,395	ఇబ్రహీం	టీఆర్‌ఎస్	37,506
2009	రాజేశ్వర్‌రెడ్డి	స్వతంత్ర	38,385	ఇబ్రహీం	టీఆర్‌ఎస్	33,110
2004	పులివీరన్న	స్వతంత్ర	63,110	పి.చంద్రశేఖర్	టీడీపీ	43,828
1999	పి.చంద్రశేఖర్	టీడీపీ	51,065	పులివీరన్న	కాంగ్రెస్	44,377
1994	పి.చంద్రశేఖర్	టీడీపీ	59,849	పులివీరన్న	కాంగ్రెస్	24,716
1989	పులివీరన్న	కాంగ్రెస్	48,700	పి.చంద్రశేఖర్	టీడీపీ	42,739
1985	పి.చంద్రశేఖర్	టీడీపీ	44,364	జి.సహదేవ్	కాంగ్రెస్	30,915
1983	పి.చంద్రశేఖర్	టీడీపీ	28,202	ఎం.ఎ.షుకూర్	కాంగ్రెస్	19,965
1980 ఉ.ఎ.	ఆంజనేయులు	కాంగ్రెస్	28,676	ఆర్.రెడ్డి	జనతా	10,742
1978	ఎం.రామిరెడ్డి	కాంగ్రెస్.ఐ	23,861	కెకె.రెడ్డి	జనతా	12,349
1972	ఇబ్రహీం అలీ అన్సారీ	కాంగ్రెస్	25,266	టీఆర్.రెడ్డి	బీజేఎస్	18,621
1967	ఇబ్రహీం అలీ అన్సారీ	కాంగ్రెస్	24,846	రాజేశ్వర్‌రెడ్డి	బీజేఎస్	7,746
1962	ఎం.రామిరెడ్డి	స్వతంత్ర	15,282	ఎండి.ఇబ్రహీం అలీ	కాంగ్రెస్	11,648
1957	ఇ.చిన్నప్ప	ప్రజాపార్టీ	8,840	ఎం.రామిరెడ్డి	పీఎస్‌పీ	7,210
1952	పి.హనుమంతరావు	కాంగ్రెస్	16,514	ఎస్.రావు	సోషలిస్టు	7,846

సెగ్మెంట్‌లో 17 సార్లు ఎన్నికలు..

మహబూబ్‌నగర్ అసెంబ్లీ స్థానానికి మొత్తం 17 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో కాంగ్రెస్, కాంగ్రెస్.ఐ కలిసి ఆరు సార్లు విజయం సాధించగా, టీడీపీ నాలుగు మార్లు, ప్రజాపార్టీ 1957లో విజయం సాధించాయి. ఇండిపెండెంట్లు ఎం.రాంరెడ్డి (1962), పులి వీరన్న (2004), ఎస్.రాజేశ్వర్‌రెడ్డి(2009)లో గెలుపొందారు. టీడీపీ తరఫున పి.చంద్రశేఖర్ నాలుగు సార్లు విజయం సాధించారు. 1962లో ఇండిపెండెంట్‌గా గెలిచిన రాంరెడ్డి.. 1978లో ఇందిరా కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 2004లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచిన పులి వీరన్న.. 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. 2012లో ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి మృతితో ఉప ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించారు. 2014, 2018 సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తరఫున వి.శ్రీనివాస్‌గౌడ్ గెలుపొందారు.

ఎన్నికల 'చిత్రం'


మీ కోసం దోశ వేస్తా..
ఎన్నికల్లో కారు గుర్తును మరవకండి..


ఓటర్లను ఆప్యాయంగా పలుకరిస్తూ..


కూలిన ఇంట్లోనే..

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. పార్టీల శ్రేణులతో పాటు అభ్యర్థులు ఇంటింటికెళ్లి వినూత్నంగా ప్రచారం చేస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఓటర్లను ఆప్యాయంగా పలుకరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం లింగన్నపల్లిలో కూలిన ఇంటిని బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి సందర్శించి బాధితురాలికి భరోసా కల్పించారు. వనపర్తి జిల్లా అమరచింతలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ బీడీలు చుట్టడంతో పాటు టిఫిన్ సెంటర్‌లో దోశ వేస్తూ ఓట్లను అభ్యర్థించారు.

- సాక్షి నెట్‌వర్క్

ఆ ఇద్దరికి విమర్శించే స్థాయి లేదు..


మాట్లాడుతున్న డీకే అరుణ

గద్వాల రూరల్: ఈ ప్రాంత అభివృద్ధికి, బీడు భూముల్లో సాగునీరు పారించేందుకు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాటం చేశాను.. నన్ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ అభ్యర్థి సరిత, బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలకు లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీకే బంగ్లాలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నెట్టెంపాడు కోసం గద్వాల నుంచి హైదరాబాద్‌కు పాదయాత్రతో పాటు ఆమరణ నిరహారదీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఆర్డీఎస్ కోసం కత్తులకు ఎదురొడ్డి పోరాడానని చెప్పారు. తనపై లేనిపోని విమర్శలు చేస్తే సహించనన్నారు. కేవలం వ్యక్తిగత స్వార్థం కోసమే పార్టీ మారి బహుజన వాదంతో ప్రజలను మోసం చేయాలని యత్నిస్తున్నారని విమర్శించారు. నాలుగేళ్లపాటు క్యాబినెట్ ర్యాంక్ పదవి జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉండి గద్వాలకు చేసిందేమీలేదన్నారు. అధికార పార్టీలో ఉన్నప్పుడు కేసీఆర్‌ను పొగడ్తలతో ముంచెత్తిన ఆమె.. ఇప్పుడు అదే కేసీఆర్‌ను విమర్శించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కోట్లకు పడగలెత్తిన సీడ్ మాఫియా తమ అక్రమ వ్యాపారాలు సజావుగా సాగాలని ఈ ప్రాంతానికి సంబంధం లేని వ్యక్తిని బహుజన వాదంతో ఇక్కడికి తీసుకొచ్చి గద్వాలను సర్వనాశనం చేయాలని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ల్యాండ్ మాఫియా, సాండ్ మాఫియా అయితే.. కాంగ్రెస్ పార్టీ వాళ్లు సీడ్ మాఫియా, రియల్ ఎస్టేట్ మాఫియా అని ఆరోపించారు. ఈనెల7న ఓబీసీ బహిరంగ సభ, 11న మందకృష్ణ నేతృత్వంలో తలపెట్టిన మాదిగల సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఓబీసీలు, మాదిగలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ అభ్యర్థి శివారెడ్డి, రామాంజనేయులు, బండల వెంకట్రాములు, పులిపాటి వెంకటేష్, రాజేష్ తదితరులు ఉన్నారు.

జూరాలకు 1,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శనివారం 1,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 99, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 731 క్యూసెక్కులతో కలిపి మొత్తం 2,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలలో ప్రస్తుతం 6.416 టీఎంసీల నీటినిల్వ ఉంది.

శ్రీశైలంలో నీటిమట్టం 842.5 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో 842.5 అడుగుల వద్ద 65.7316 టీఎంసీల నీరు నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 31,784 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,380, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 725, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 1.670 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 3,462 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. 165 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రెండు దుకాణాల్లో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న రెండు కిరాణా షాపుల్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుల వివరాల మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన గోపి, రామకృష్ణ కొల్లాపూర్ క్రాస్‌రోడ్ వద్ద కిరాణా షాపులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దుకాణాల తాళం విరగొట్టి చోరీకి పాల్పడ్డారు. గోపి దుకాణంలోని కౌంటర్‌లో ఉన్న రూ.2లక్షల నగదుతో పాటు రూ.లక్ష విలువజేసే కిరాణా సామగ్రి చోరీ చేశారు. రామకృష్ణ కిరాణా దుకాణంలో రూ.10వేల నగదుతో పాటు సీసీ కెమెరా ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మహేందర్ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రాజు (ఫైల్)

అయిజ: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మండలంలోని చిన్న తాండ్రపాడుకు చెందిన 2వ వార్డు సభ్యురాలు సోములమ్మ, నరసింహులు దంపతుల కుమారుడు రాజు (23) శనివారం మేకలకు మేత తెచ్చేందుకు గ్రామం దాటి వెళ్లాడు. వేపచెట్టు కొమ్మలు కత్తిరిస్తున్న సమయంలో విద్యుత్ తీగలు ఉండడంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదవశాత్తు బావిలో పడి..

పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాములకు చెందిన సంపంగి మల్లేష్(32) శనివారం గ్రామ సమీపంలోని ఈదోనిబాయికుంటలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. ఈదోనిబాయికుంటలో తేలిన మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అతనికి మూర్ఛరావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందినట్లు మృతుని భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజు తెలియజేశారు.

పరిశ్రమ విస్తరణకు వ్యతిరేకం కాదు..

- ఓవర్‌లోడ్ వాహనాలతో ఇబ్బందులు
- జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావుకు తెలియజేసిన గ్రామాల ప్రజలు
- రేపు మరోసారి సమావేశం


బీఎస్‌సీపీఎల్ పరిశ్రమ వద్ద ప్రజాభిప్రాయ సేకరణలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఈఈ సంగీత

బాలానగర్: నియమనిబంధనల ప్రకారం బీఎస్‌సీపీఎల్ పరిశ్రమ విస్తరణకు మేం వ్యతిరేకం కాదని, క్రషర్ పరిశ్రమల నుంచి వచ్చే ఓవర్ లోడ్ వాహనాలతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏడుగుట్టల తండా సర్పంచ్ రాంజీనాయక్ తెలియజేశారు. బాలానగర్ మండల పరిధిలోని మెదంపల్లి గ్రామ రెవెన్యూ శివారు, ఏడుగుట్టల తండాలో ఏర్పాటు చేయనున్న బీఎస్‌సీపీఎల్ పరిశ్రమ విస్తరణకు జిల్లా అదనపు కలెక్టర్ మోహన్ రావు, పొల్యూషన్ బోర్డు ఈఈ సంగీత ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కాగా ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ ఉదయం 8.30 గంటలకే ప్రారంభించారు. కేవలం గంట సమయంలో 9.32 గంటల వరకే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ కారణంగా అదనపు కలెక్టర్ మరో కార్యక్రమానికి వెళ్లాల్సిన కారణంగా త్వరితగతిన పూర్తిచేశారని నిర్వాహకులు తెలియజేశారు. దీంతో బీఎస్‌సీపీఎల్ పరిశ్రమ వద్ద ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి పలువురు గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు ఆలస్యంగా రావడంతో అప్పటికే కార్యక్రమం పూర్తయ్యిందని తెలియడంతో మళ్లీ సోమవారం నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుదామని వెనుదిరిగారు.

ఓవర్‌లోడ్‌తో వాహనాలు..

అంతకు ముందు నిర్వహించిన కార్యక్రమంలో బోడజానంపేట మాజీ ఎంపీటీసీ బాలు నాయక్ మాట్లాడారు. క్రషర్ పరిశ్రమల వ్యక్తులు ఓవర్‌లోడ్‌తో వాహనాలను బయటకు పంపుతుండటంతో వేసిన రోడ్లు, కొద్ది రోజులకే గుంతలమయంగా తయారవుతున్నాయని, ఓవర్ లోడ్ వాహనాలను అనుమతించరాదని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాభివృద్ధికి మరింత తోడ్పాటుగా నిలవాలని మెదంపల్లి వ్యక్తి గురుపాదం తెలియజేశారు. బ్లాస్టింగ్ చేసే సమయంలో హారన్ మోగించాలని, లోకల్ వ్యక్తులకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని పలుగుమీది తండా నాయకుడు రాంబాబు తెలియజేశారు. పలుగుమీది తండా ఉప సర్పంచ్ శివ మాట్లాడుతూ.. సమీప వ్యవసాయ భూముల రైతులకు అందరికీ నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ విజయ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

యాసంగిలో ఆరుతడి శ్రేయస్కరం


వ్యవసాయ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ విస్తరణ సంచాలకురాలు డా. వి.సుధారాణి

బిజినేపల్లి: రాష్ట్రంలో యాసంగి పంట సాగు కాలం ప్రారంభమైనందున సాగు నీటి వనరులు ఉన్న రైతులు వరి కాకుండా ఆరుతడి పంటలను సాగు చేస్తే రైతులకు, భూమికి శ్రేయస్కరమని ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డా.వి.సుధారాణి సూచించారు. శనివారం పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.సుధారాణి మాట్లాడుతూ యాసంగిలో వర్షాలు తక్కువగా, ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ఈ కారణంగా నీటి వనరులు కూడా తగ్గుముఖం పట్టనుండడంతో పప్పు దినుసులు, నూనె గింజల పంటలు, తృణధాన్యాలను సాగు చేయాలన్నారు. రైతులు ప్రస్తుత సమయంలో వ్యవసాయంలో కొత్త పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు పొందాలన్నారు. ఏదైన పంటను సాగు చేసే ముందు ఆ పంట దిగుబడి మొక్క మార్కెటింగ్, ధరలపై కాస్త అవగాహనతో ఉండాలన్నారు. వ్యవసాయంలో పంటల సాగు మూస పద్ధతిలో కాకుండా నిత్య నూతనంగా సాగు చేయాలని, అప్పుడే బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముకునే అవకాశం ఉందన్నారు. పాలెం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ మల్లారెడ్డి మాట్లాడుతూ రైతులు అధిక సాంద్రతలో పత్తి పంటను సాగు చేసి తక్కువ కాలంలో దిగుబడి పొంది మరో పంటను సాగు చేసుకోవాలన్నారు. అధిక దిగుబడులను ఇచ్చే వరి, వేరుశనగ రకాలను వేసుకోవాలన్నారు. జాతీయ పత్తి పరిశోధన సంస్థ నాగపూర్ సహకారంతో పాలెం కేవీకేలో క్షేత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

సోలార్ పరిశ్రమ ఎదుట రైతుల నిరసన

- మా భూములు పరిశ్రమ పేరుపై మారాయని ఆవేదన


పురుగు మందు డబ్బాతో ఆందోళన చేపడుతున్న మహిళా రైతు మణెమ్మ

బాలానగర్: మా రైతుల భూములు నాలుగు సంవత్సరాలుగా సోలార్ పరిశ్రమ పై ఉంటే మేం ఏం చేయాలి, ఎలా బతకాలని మండల పరిధిలోని నేరళ్లపల్లి రైతులు ఆ పరిశ్రమ గేటు ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. దీంతో పరిశ్రమ వ్యక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ అక్కడకు చేరుకుని రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని, అక్కడ వారి భూముల సమస్యలు పరిష్కరించుకోవాలని తెలియజేశారు. దీంతో రైతులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. ధరణి వచ్చిన నాటి నుంచి తమ భూములు సోలార్ పరిశ్రమ పేరిటకు మారాయని, పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గతంలో పలుమార్లు సోలార్ పరిశ్రమ ఎదుట, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టగా.. కొంతమంది భూములు తిరిగి రైతుల పేరిటకు మారాయని, కొద్దిరోజులకే తిరిగి సోలార్ పరిశ్రమ పేరిటకు మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మా భూములు అమ్మి కుమార్తె పెళ్లి చేద్దామని చూస్తూ.. 3 సంవత్సరాలుగా అలాగే పెళ్లి చేయకుండా ఉండిపోయామని వాపోయారు. వచ్చే రైతుబంధు సైతం పరిశ్రమ వ్యక్తులకు వస్తుందన్నారు. మా భూములు ప్రైవేట్ పరిశ్రమలకు కట్టబెట్టారని, మాకు సావే శరణ్యమని మరో మహిళా రైతు పురుగు మందు డబ్బాతో వచ్చి సోలార్ పరిశ్రమ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమ భూములు తమకు వచ్చేలా చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు విన్నవించారు.

భారీగా నగదు సీజ్


నందిన్నె చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదుతో పోలీసులు

నారాయణపేట రూరల్: అసెంబ్లీ ఎన్నికల వేళ జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. శనివారం రూ.11లక్షల నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. కృష్ణా పీఎస్ పరిధిలో రూ.6,01,100, మాగనూర్ పీఎస్ పరిధిలో రూ.2లక్షలు, మక్తల్ పీఎస్ పరిధిలో రూ.లక్ష 90వేలు, నారాయణపేట పీఎస్ పరిధిలో రూ.లక్ష 22వేలను పట్టుకున్నట్లు వెల్లడించారు.

అలంపూర్ రూరల్: ఆంధ్ర–తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన ర్యాలంపాడ్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద రూ.లక్ష నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. కర్నూల్ జిల్లా పంచలింగాలకు చెందిన ముప్పసాని నరేష్ ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తరలిస్తుండగా, స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా క్యాతూర్‌కు చెందిన సోమనాద్రిగౌడ్ బైక్‌పై రూ.15,800 విలువజేసే మద్యం తరలిస్తుండగా, పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేటీదొడ్డి: రాయచూర్ నుంచి గద్వాలవైపు మూడు వాహనాల్లో తరలిస్తున్న రూ.3లక్షల 60వేల నగదును కేటీదొడ్డి మండలం నందిన్నె చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

మైసమ్మ అడవిలో చిరుత సంచారం

నవాబుపేట: మండలంలోని మైసమ్మ అడవిలో మరోసారి చిరుత సంచారం ఆందోళన కలిగించింది. నిత్యం ప్రయాణికులతో ఉండే నవాబుపేట మైసమ్మ మహబూబ్‌నగర్ రహదారిలో శనివారం సాయంత్రం చిరుత తిరుగుతూ ప్రయాణికులకు కనిపించటంతో ఆందోళన మొదలైంది. మైసమ్మ అడవిలో పెద్ద మలుపు దగ్గర రోడ్డు దాటుతూ చిరుత పిల్లలమర్రి వైపు వెళ్తూ కనిపించింది. జిల్లా కేంద్రం నుంచి నవాబుపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు దాన్ని చూసి భయాందోళనతో అక్కడే వాహనాన్ని నిలిపేసి ఆగిపోయారు. కొంతసేపటికి మరో వాహనం రావటంతో దాన్ని పాలో అవుతూ వెళ్లిపోయారు. గత నెలలో సైతం చిరుత రోడ్డుపై కూర్చొని కనిపించింది. తాజాగా రోడ్డు దాటుతూ కనిపించింది.